17,654 కంపెనీలు బంద్



గత 10 నెలల్లో మూతబడినట్టు రాజ్యసభలో ప్రకటించిన కేంద్రప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశవ్యాప్తంగా 17వేలకుపైగా కంపెనీలు మూతబడ్డాయి. మంగళవారం రాజ్యసభలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్రా ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానం ప్రకారం.. గత ఏడాది ఏప్రిల్ మొదలు ఈ ఏడాది జనవరి 26 వరకు మొత్తం 17,654 సంస్థలు షట్‌డౌన్ అయ్యాయి. అయితే వీటిలో ఇతర సంస్థల్లో విలీనమైనవి, బడా సంస్థలకు అమ్ముడైనవి, నష్టాలతో చేతులెత్తేసినవి, ఆర్థిక సమస్యలతో మూతబడినవి అన్నీ ఉన్నాయని మంత్రి వివరించారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) 22,044, అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) 84,801 కంపెనీలు బంద్ అయినట్టు తెలుస్తున్నది. మరోవైపు గడిచిన దాదాపు 10 నెలల్లో దేశంలో కంపెనీల చట్టం కింద కొత్తగా 1,38,027 కంపెనీలు నమోదైనట్టు కూడా మంత్రి తెలిపారు. అలాగే 2023-24లో 1,85,318 కంపెనీలు, 2022-23లో 1,59,302 కంపెనీలు నమోదయ్యాయి. ఇకపోతే గత ఐదేండ్లలో దేశంలో 339 విదేశీ కంపెనీలు ఏర్పాటయ్యాయని మల్హోత్రా వెల్లడించారు. ఈ ఏడాదిలో ఏపీ, ఢిల్లీ, కేరళల్లో ఒక్కోటి.. తమిళనాడులో రెండు వచ్చాయన్నారు. నిజానికి 2020 నుంచి భారత్‌లో విదేశీ సంస్థల నమోదు క్రమేణా తగ్గుతున్నట్టు చెప్పారు.

82 దర్యాప్తుల్లో నివేదికలు

గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం (ఎస్ఎఫ్ఐవో) 82 దర్యాప్తు నివేదికల్ని సమర్పించినట్టు మంత్రి మల్హోత్రా తెలిపారు. కేవలం గత ఆర్థిక సంవత్సరంలోనే 2023-24 గరిష్ఠంగా 40 రిపోర్టులు వచ్చాయని వివరించారు. అయినప్పటికీ నయాపైసా రికవరీ లేదని స్పష్టం చేశారు. ఇక ఈ మూడేండ్లలోనే ఎస్ఎఫ్ఐవోకు మరో 26 కేసులను కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అప్పగించినట్టు చెప్పారు. గడిచిన ఐదేండ్లలోనైతే ఈ సంఖ్య 72గా ఉందన్నారు.

2,664 విల్‌ఫుల్ డిఫాల్టర్లు

గత ఏడాది మార్చి ఆఖరుకల్లా 2,664 మంది ప్రత్యేక రుణగ్రహీతలను ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులుగా వర్గీకరించినట్టు ఓ లిఖితపూర్వక సమాధానంలో రాజ్యసభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. వీరిలో వ్యక్తిగత, విదేశీ రుణగ్రహీతలెవరూ లేరని స్పష్టం చేశారు. రుణాలను ఎగ్గొడుతున్నవారిపై కఠిన చర్యలను తీసుకొనేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి కేంద్రం పనిచేస్తున్నట్టు వివరించారు.

86 వేలకు చేరువలో పుత్తడి

మరో రూ.500 పెరిగి రూ.85,800కి పదిగ్రాముల ధర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. సామాన్యుడికి అందనంత స్థాయికి చేరుకుంటున్న పుత్తడి మరో మైలురాయికి చేరువైంది. వరుసగా ఐదు రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధర మంగళవారం కూడా మరో రూ.500 ఎగబాకి రూ.86 వేలకి చేరువైంది. దేశరాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.500 పెరిగి రూ.85,800 పలికింది. ఆభరణాలు, రిటైలర్ల నుంచి డిమాండ్ అత్యధికంగా ఉండటం వల్లనే ధరలు పెరిగాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. జనవరి 1 నుంచి ఇప్పటి వరకు గోల్డ్ ధర రూ.6,410 లేదా 8 శాతం ఎగబాకి రూ. 85,800కి చేరుకున్నది. నెల రోజుల క్రితం ఈ ధర రూ.79,380గా ఉన్నది. గత ఐదురోజులుగా పెరుగుతూ వచ్చిన వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉండటంతో కిలో వెండి రూ.500 తగ్గి రూ.95,500కి పరిమితమైంది. ధరలు తగ్గకముందు ఇది రూ.96 వేలుగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర రికార్డు స్థాయి 2,872 డాలర్లకు చేరుకున్నది. కెనడా, మెక్సికో దేశాలపై ట్రంప్ విధించిన పన్ను వాయిదాపడటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి.

భయపడి మూసేయలేదు

కంపెనీ షట్‌డౌన్‌పై హిండెన్‌బర్గ్ అధినేత అండర్సన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అదానీ గ్రూప్ అవకతవకలపై సంచలనాత్మక రిపోర్టుల్నిచ్చిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్.. అనూహ్యంగా మూతబడిన విషయం తెలిసిందే. అయితే ఎవరికీ భయపడి తాను సంస్థను మూసేయలేదని ఈ అమెరికన్ షార్ట్ సెల్లర్ వ్యవస్థాపక అధినేత నాథన్ అండర్సన్ స్పష్టం చేశారు. తమపై లీగల్‌గానీ లేక వ్యక్తిగతంగాగానీ ఎవరూ ఏ రకమైన బెదిరింపులకు దిగలేదన్న అండర్సన్.. కేవలం పని ఒత్తిడి కారణంగానే హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను మూసేసినట్టు పీటీఐకిచ్చిన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్లలో అక్రమాలకు పాల్పడిందంటూ 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రిసెర్చ్ ఓ రిపోర్టును విడుదల చేసిన సంగతి విదితమే. దీంతో అదానీ కంపెనీల షేర్లన్నీ ఒక్కసారిగా కుప్పకూలాయి. తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నాయి. ఫలితంగా అటు గ్రూప్, అదానీ వ్యక్తిగత సంపద ఏకంగా 150 బిలియన్ డాలర్లకు పైగా కరిగిపోయింది. వ్యాపార-పారిశ్రామిక వర్గాల్లోనేగాక, రాజకీయంగానూ ఇది తీవ్ర దుమారాన్నే రేపింది. ఇక ఈ వ్యవహారంలో సెబీ చీఫ్ మాధవీ పురి బచ్ దంపతుల హస్తం కూడా ఉందని గత ఏడాది ఆగస్టులో మరో బాంబు పేల్చింది. దీంతో పార్లమెంట్‌లోనూ ఆ ప్రకంపనలు కనిపించాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 16న ఆశ్చర్యకరంగా హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను మూసేస్తున్నట్టు, తమవద్ద అన్ని కేసుల దర్యాప్తులు అయిపోయినట్టు అండర్సన్ చెప్పారు. వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు. తాజా ఇంటర్వ్యూలోనూ అదే చెప్పారు. 2017లో మొదలైన ఈ కంపెనీ.. 8 ఏండ్లలో అనేక దేశ, విదేశీ కంపెనీలపై సంచలన రిపోర్టుల్నిచ్చింది. ఆ వివరాలను అమెరికా స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్లు, దర్యాప్తు ఏజెన్సీలకు పంపింది.

ఎన్ఎస్ఈ లాభం 3,834 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశంలో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఈ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.3,834 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.1,975 కోట్ల లాభంతో పోలిస్తే 94 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో ఆదాయం ఏడాది ప్రాతిపదికన 21 శాతం ఎగబాకి రూ.3,974 కోట్ల నుంచి రూ. 4,807 కోట్లకు చేరుకున్నది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లో రూ. 45, 499 కోట్ల ఆదాయంపై రూ.14,780 కోట్ల నికర లాభాన్ని గడించింది.

మళ్లీ 78 వేల పైకి సెన్సెక్స్

1,400 పాయింట్లు లాభపడ్డ సూచీ • 380 పాయింట్లు ఎగిసిన నిఫ్టీ

ముంబై, ఫిబ్రవరి 4: దేశీయ స్టాక్ మార్కెట్లు రివ్వున ఎగిశాయి. మెక్సికో, కెనడాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా వాయిదావేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించడంతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా పుంజుకున్నాయి. ఇదే క్రమంలో గత కొన్ని రోజులుగా నష్టాలు ఏరులైపారుతున్న దేశీయ మార్కెట్లు కదంతొక్కాయి. మదుపరులుగు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ ఇంట్రాడేలో 1,472 పాయింట్లు లేదా 2 శాతం వరకు లాభపడింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 1,397.07 పాయింట్లు లేదా 1.81 శాతం అందుకొని 78,584.81 పాయింట్ల వద్దముగిసింది. దీంతో సూచీలు నెల గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు అయింది. మరోసూచీ నిఫ్టీ సైతం 378.20 పాయింట్లు లేదా 1.62 శాతం అందుకొని 23,739.25 వద్ద ముగిసింది. జనవరి 3 తర్వాత సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం. రిజర్వుబ్యాంక్ తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. దీంతో 6 లక్షల కోట్ల మదుపరుల సంపద పెరిగింది. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.5,95,996.51 కోట్లు పెరిగి రూ.4,25,50,826.11 కోట్లు(4.88 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. వాణిజ్య యుద్ధానికి తెరలేపిన ట్రంప్..ఇతర దేశాల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో రెండు దేశాలపై విధించిన టారిఫ్ విషయంలో వెనక్కి తగ్గడం సూచీల్లో జోష్ పెంచిందని మోతీలాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ సిద్దార్థ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌పై మదుపరులు వేచి చూసే దోరణి అవలంభించినప్పటికీ గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలు పెరగడానికి ప్రధాన కారణం.

- ఎల్అండ్‌టీ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- అదానీ పోర్ట్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, టాటా మోటర్స్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, కొటక్ బ్యాంక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, టాటా స్టీల్, మహీంద్రా, ఎయిర్‌టెల్, టైటాన్, ఐటీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఐటీసీ హోటల్స్, జొమాటో, నెస్లె, మారుతి, హెచ్‌యూఎల్ షేర్లు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్ 3.42 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.59 శాతం, ఎనర్జీ 2.50 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.40 శాతం, పవర్ 2.31 శాతం, ఆర్థిక సేవలు 2 శాతం చొప్పున లాభపడ్డాయి. కానీ, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు పతనం చెందాయి.

టాటా కార్లపై భారీ డిస్కౌంట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఎంపిక చేసిన మాడళ్లపై టాటా మోటర్స్ తాజాగా లక్ష రూపాయల వరకు తగ్గింపు ప్రకటించింది. వీటిలో టియాగో, టిగోర్, ఆల్ట్రోజ్, పంచ్, నెక్సాన్, హరియర్, సఫారీ మాడళ్లున్నాయి. పెట్రోల్/సీఎన్‌జీ రకాల విషయానికొస్తే.. టియాగో మాడల్‌పై రూ.35 వేలు రాయితీ ఇస్తున్నది. రూ.20 వేలు కన్స్యూమర్ డిస్కౌంట్, మరో రూ.15 వేలు ఎక్స్ఛేంజ్ డిస్కౌంట్‌లున్నాయి. ఇలాగే టిగోర్‌పై రూ.45 వేలు, ఆల్ట్రోజ్‌లో రేసర్ మినహా మిగతా వేరియంట్లపై రూ.65 వేలు, పంచ్‌పై రూ.25 వేలు, నెక్సాన్ మాడళ్లపై రూ.45 వేల రాయితీలున్నాయి. ఇక ఎస్‌యూవీ మాడళ్లైన హరియర్, సఫారీ అన్ని డీజిల్ వేరియంట్లపై రూ.75 వేల వరకు డిస్కౌంట్ వస్తున్నది. మరోవైపు, ఆల్ట్రోజ్, నెక్సాన్ డీజిల్ అన్ని రకాలపై 65వేలు, 45వేల చొప్పున డిస్కౌంట్‌లున్నాయి. అయితే ఆల్ట్రోజ్ పెట్రోల్ రేసర్ వేరియంట్‌పై గరిష్ఠంగా లక్ష డిస్కౌంట్ ఉన్నది. జనవరిలోనూ కంపెనీ రూ.85 వేల తగ్గింపునిచ్చినది తెలిసిందే.

హీరోకు 456 కోట్ల జీఎస్టీ నోటీసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశీయ ఆటోరంగ దిగ్గజం, ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్‌కు రూ.456.06 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు వచ్చింది. రాజస్థాన్‌లోని అల్వార్ సెంట్రల్ జీఎస్టీ అదనపు కమిషనర్ నుంచి ఈ తాఖీదులు అందాయి. 2017 జూలై నుంచి 2024 మార్చి వరకు సరఫరా జరిగిన వాహన విడిభాగాలు, ఇతరత్రా వాటి ధరలకు సంబంధించిన వ్యవహారంలో ఈ నోటీసులు జారీ అయ్యాయి. మరోవైపు ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీకి కూడా రూ.101. 95 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు వచ్చింది. గత ఐదు ఆర్థిక సంవత్సరాలకుగాను ఆయా రాష్ట్రాల్లో జీఎస్టీ షార్ట్ పేమెంట్లకు సంబంధించి ఈ నోటీసు విడుదలైందని మంగళవారం ఎల్ఐసీ తెలిపింది. కాగా, త్వరలో జీఎస్టీ శ్లాబులు, రేట్లపై జీఎస్టీ కౌన్సిల్ ఓ నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలియజేశారు.

కారు బోల్తా : ఇద్దరికి గాయాలు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 4 : మండలంలోని కాకర్లపహాడ్ గ్రామశివారులో సోమవారం రాత్రి మారుతీ కారు అడవిపందిని ఢీకొట్టి కారు బోల్తా పడిన ఘటనలో రంగారెడ్డి జిల్లా చౌదరిగూడకు చెందిన శివలింగం, యాదయ్యకు గాయాలైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. శివలింగం, యాదయ్య మారుతీ షిఫ్ట్ కారులో చౌదరిగూడ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లి రాత్రి తిరిగి నవాబ్‌పేట మీదుగా వారి సొంత గ్రామానికి వెళ్తుండగా.. కాకర్లపహాడ్ గ్రామ సమీపంలో అడవిపంది రోడ్డు దాటే క్రమంలో కారును ఢీకొనడంతో కారు అదుపుతప్పి రోడ్డుపక్కల బోల్తా కొట్టినట్లు ఆయన వివరించారు. కారు డ్రైవర్ యాదయ్యతోపాటు శివలింగానికి గాయాలు కాగా జిల్లా దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వంద శాతం ఆపార్‌ను పూర్తి చేయాలి

మక్తల్, ఫిబ్రవరి 4 : ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు వంద శాతం ఆపార్ కార్యక్రమాన్ని తర్వగా పూర్తి చేయాలని ఎంఈవో అనిల్‌గౌడ్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మక్తల్, మాగనూర్ మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల వివరాలను అపార్ ద్వారా పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on X@SCRailwayIndia

దమ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

PUB/0120

No. Y/C. 256/Comml. Pub/NFR/2024-25. తేది: 04/02/2025

హైదరాబాద్ డివిజన్‌లో అవుట్ ఆఫ్ హోమ్, RDN మరియు సకలవిధ స్టాటిక్ సర్వీస్ కేటగిరి ద్వారా కమర్షియల్ పబ్లిసిటీ కాంట్రాక్ట్స్ ఇచ్చుట.

ఇ-వేలం షెడ్యూల్ దిగువ ఇవ్వబడినది:

క్ర. సం.	కేటగిరి	క్యాటలాగ్ నెం.	వివరాలు	వేలం తేది	వేలం ప్రారంభ సమయం	వేలం ముగింపు సమయం
1	ADVT-HYB-KCG-OH-120-25-1 (అవుట్ ఆఫ్ హోమ్ ప్రకటన)	HYB-ADVT-KCG	కాచిగూడ వద్ద అవుట్ ఆఫ్ హోమ్ కేటగిరి క్రింద ప్రకటన హక్కులు	19.02.2025	11.30	12.00
2	ADVT-HYB-MBNR-OH-121-25-1 (అవుట్‌ఆఫ్ హోమ్ ప్రకటన)	HYB-ADVT-MBNR	మహబూబ్‌నగర్ వద్ద అవుట్ ఆఫ్ హోమ్ కేటగిరి క్రింద ప్రకటన హక్కులు	19.02.2025	11.40	12.10
3	ADVT-HYB-MBNR-OSN-122 -25-1 (స్టేషన్ ఆవరణలో ప్రకటనలు-నాన్ డిజిటల్)	HYB-ADVT-MBNR	మహబూబ్‌నగర్, దేవరకద్ర మరియు వనపర్తి రోడ్ స్టేషన్ల వద్ద RDN కేటగిరి క్రింద ప్రకటన హక్కులు	19.02.2025	11.50	12.20
4	MSS-HYB-VAR-BS-75-24-1 (సకలవిధ స్టాటిక్ సర్వీసులు-బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్స్)	MSS-HYB-VAR-BS-75	హైదరాబాద్ డివిజన్‌లో విద్యానగర్ (సన్-అర్బన్) స్టేషన్ వద్ద బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్	17.02.2025	11.00	11.30
5	MSS-HYB-SFX-GZ-71-24-1 (సకలవిధ స్టాటిక్ సర్వీసులు-గేమింగ్ జోన్)	MSS-HYB-SFX	హైదరాబాద్ డివిజన్‌లో సఫిల్‌గూడ రైల్వే స్టేషన్ వద్ద గేమింగ్ జోన్ (బాక్స్ క్రికెట్ కమ్ స్నాక్స్ బార్) ఏర్పాటు	17.02.2025	11.10	11.40
6	MSS-HYB-ALW-GZ-81-25-1 (సకలవిధ స్టాటిక్ సర్వీసులు-గేమింగ్ జోన్)	MSS-HYB-ALW-GZ	హైదరాబాద్ డివిజన్‌లో అల్వాల్ రైల్వే స్టేషన్ వద్ద గేమింగ్ జోన్	17.02.2025	11.20	11.50
7	MSS-HYB-KCG-PS-52-24-1 (సకలవిధ స్టాటిక్ సర్వీసులు-పార్శిల్ స్కానర్)	MSS-HYB-KCG-PS	కాచిగూడ రైల్వే స్టేషన్ యొక్క కేటాయించబడిన ప్రదేశాల వద్ద పార్శిల్ స్కానర్స్ స్థాపన, ఆపరేషన్ మరియు నిర్వహణ	17.02.2025	11.30	12.00

A0156 సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్

భవిష్యత్ శాస్త్రవేత్తలుగా తయారు కావాలి

ప్రదర్శనలను తిలకిస్తున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 4 : విద్యార్థులను భవిష్యత్ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాప్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలలో ఆయన పాల్గొని విద్యార్థులు తయారు చేసిన నమూనాలు, ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముబీన్, బీఆర్ఎస్ నాయకుడు బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.

అడవిపంది దాడిలో రైతుకు గాయాలు

కొల్లాపూర్, ఫిబ్రవరి 4 : మండలంలోని మొలచింతలపల్లిలో అడవి పంది దాడిలో రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి క్షతగాత్రుడి భార్య నాగలక్ష్మి తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటస్వామి తన పొలంలో సాగుచేసిన మునుము పంటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. మంగళవారం ఉదయం నాగలక్ష్మి భర్తకు టిఫిన్ తీసుకొని పొలానికి వెళ్లింది. అదే సమయంలో పంటలో నెమళ్లు పంట నాశనం చేస్తుండగా వాటిని బెదిరించేందుకు వెళ్లిన వెంకటస్వామిపై పొలంలో ఉన్న అడవిపంది దాడి చేసింది. అక్కడి నుంచి నాగలక్ష్మిపై కూడా దాడి చేసేందుకు ప్రయత్నించగా ఆమె పారిపోయి తప్పించుకున్నది. తీవ్రంగా గాయపడిన వెంకటస్వామిని 108 ద్వారా ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

కొనసాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 4 : వనపర్తి జిల్లావ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. ఉదయం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలో 93.57 శాతం , మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలో 96.66 శాతం విద్యార్థులు హాజరయ్యారని డీఐఈవో ఎర్ర అంజయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాన్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రైవేట్ ఒకేషనల్ కళాశాలను ఆయన సందర్శించారు. ఆయనతో పాటుగా పరీక్షల నిర్వాహకుడు , కన్వీనర్ ఉన్నారు.

యువకుడు ఆత్మహత్య

బాలానగర్, ఫిబ్రవరి 4 : ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం బాలానగర్ మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. బాలానగర్‌కు చెందిన శ్రీకాంత్ యాదవ్ (22) రాత్రి సుమారు 9:30గంటల ప్రాంతంలో ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. యువకుడి ఆతహత్యకు గల కారణాలు తెలియరాలేదు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న శ్రీకాంత్ యాదవ్ మధ్యాహ్నం ఇంటికి వచ్చాడని, చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు అభినందన

మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 4 : మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ల బృందం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలబొకేలతో సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం సహాయ సహకారాలు అందిస్తామని, రాబోవు వేసవిలో నీటి ఎద్దడి, కరెంట్ సమస్యలు , పట్టణ పరిశుభ్రత తదితర అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, లక్ష్మీనారాయణ, బండారు కృష్ణ, కంచెరవి, బీఆర్ఎస్ నాయకులు ఇమ్రాన్, రహీం, రమేశ్, ప్రభాకర్, నందిమల్ల అశోక్ ఉన్నారు.

లెప్రసీ, టీబీపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పారామెడికల్ ఆఫీసర్

ఎర్రవల్లి చౌరస్తా, ఫిబ్రవరి 4 : ప్రతి చిన్నారి తప్పనిసరిగా లెప్రసీ, టీబీపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారులు అన్నారు. మండలంలోని పదోపటాలంలోని జెడ్పీహెచ్ఎస్, సరస్వతీ పాఠశాలలోని విద్యార్థులకు లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ వంటి వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా పారామెడికల్ ఆఫీసర్ మల్లికార్జున్ మాట్లాడారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ రమేశ్, హెచ్ఎం విజయ్, సరస్వతి పాఠశాల గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 4 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. కొల్లాపూర్‌కు చెందిన నలుగురు వ్యక్తులు హైదరాబాద్‌లోని ఫంక్షన్‌కు సోమవారం కారులో వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి వస్తుండగా చందుబట్ల గేట్ సమీపంలో మంగళవారం వేకువజామున ప్రమాదవశాత్తు కారు కాల్వను ఢీకొని పుష్పలత (45) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెంది. కారులో ఉన్న మరో ముగ్గురికి గాయాలయ్యాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 4 : కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్వకుర్తి పట్టణానికి చెందిన అరుణ్‌కుమార్(62) చికిత్స పొందుతూ మృతి చెందాడు. గట్టిప్పలపల్లి గ్రామానికి చెందిన రిటైర్డు డ్రైవర్ అరుణ్‌కుమార్ కల్వకుర్తి పట్టణంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం కల్వకుర్తి నుంచి తర్నికల్ గ్రామానికి వెళ్లి తిరిగివస్తుండగా బైక్ ఢీకొనడంతో అరుణ్‌కుమార్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. ఆయన్ను హైదరా బాద్‌లోని ఆర్టీసీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు..

కోడేరు, ఫిబ్రవరి 4 : చేపల వేటకు వెళ్లి ప్రమాదావశాత్తు కుంటలో వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని మైలారంలో మంగళవారం చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మైలారానికి చెందిన బర్ల కురుమయ్య(46) గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి మంగళవారం ఊర కుంటలో చేపలు పట్టడానికి వెళ్లారు. చేపల కోసం వల వేసిన కురుమయ్య నీటిలోకి దిగి ప్రమాదావశాత్తు మునిగిపోయాడని తెలిపారు. మృతదేహం కోసం ఈతగాళ్లతో గాలిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ మశన్న కోరారు.

లక్ష డప్పులు మోగిద్దాం

ధరూరు, ఫిబ్రవరి 4 : ప్రతి దళిత బిడ్డ ఈనెల 7వ తేదీన డప్పు సంకనేసుకొని హైదరాబాద్‌కు తరలివెళ్దామని దండోరా కళాకారుడు చరణ్ మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేపట్టిన లక్ష డప్పులు -వెయ్యి గొంతుల కార్యక్రమానికి కళాకారుల సమీకరణలో భాగంగా మంగళవారం మండలంలోని నీల హాళ్లిలో కార్యక్ర